ప్రజాశక్తి
సోమవారం 20 ఫిబ్రవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వారికి ఎన్నికల కోడ్ పట్టదా ?

- ఎయు విసి, రిజిస్ట్రార్‌ల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- వైసిపి అభ్యర్థికి అనుకూలంగా 'ప్రయివేటు' సమావేశం నిర్వహణ
- అధికార దుర్వినియోగంపై పలువురు మండిపాటు
- ప్రశ్నించిన ప్రజా సంఘాల నేతలను అరెస్టు చేసిన పోలీసులు



సమావేశానికి హాజరైన వైసిపి నేతలు, ప్రయివేటు విద్యా సంస్థల నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్

వారు విద్యావంతులు. ఎయు ఉన్నతాధికారులు. పదిమందికి ఆదర్శంగా నిలవాల్సిన వారు. అయితే, కనీస విజ్ఞతను మరిచి అధికార పార్టీకి అనుకూలంగా మారిపోయారు. గుట్టుచప్పుడుగా నడుస్తుందనుకున్న ఈ వ్యవహారం ఒక్కసారిగా బయటకు పొక్కడంతో నేడు వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీ విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ తమ బాధ్యతలు మరిచి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు పోలీసు పహారాలో విశాఖలోని ఓ ప్రయివేటు హోటల్లో వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అనుకూలంగా సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాలల్లో చదువుతున్న పిజి విద్యార్థులు, సిబ్బంది ఓట్లు వేసేలా చూడాలని నిర్దేశించినట్లు సమాచారం.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని జిల్లా అధికారులు

ఈ సమావేశ సమాచారం తెలిసిన వెంటనే ప్రజా సంఘాల నాయకులు జిల్లా ఆర్‌డిఒ, డిఆర్‌ఒలకు సమాచారం అందించారు. వారు వస్తామని తెలపడంతో హోటల్ వద్దకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్ సహా విద్యార్థి, యువజన సంఘం నాయకులు వచ్చారు. ప్రజా సంఘాల నేతలు వస్తున్నారన్న సమాచారంతో ఎయు విసి ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ దొడ్డిదారిన వెళ్లిపోయారు. అనంతరం ప్రజా సంఘాల నేతలు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని అడ్డగించి అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్, జి.అప్పలరాజు, విద్యార్థి సంఘం నాయకులు ఎల్‌జె.నాయుడు, బి.గౌతమ్, సూర్య ఉన్నారు.

విసి, రిజిస్ట్రార్‌లను బాధ్యతల నుంచి తొలగించాలి : సిపిఎం

ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్‌లను తక్షణమే వారి బాధ్యతల నుంచి తొలగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రయివేటు డిగ్రీ కాలేజీల యజమానులతో ఎయు విసి, రిజిస్ట్రార్‌లు సమావేశం నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించారు. విసి, రిజిస్ట్రార్‌లతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌పై కేసులు నమోదు చేయాలని డిమాండ్ మిగతా 2లో..



విశాఖ నగరంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష

87.7 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. సిటీ కమిషనరేట్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సివిల్ ఎస్‌సిటి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ సివిల్), ఎస్‌సిటి ఆర్మ్‌డ్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎపిఎస్‌పి) పోస్టులకుగాను 35 పరీక్షా కేంద్రాల్లో ఈ ప్రిలిమినరీ రాత పరీక్ష జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహించారు. 23882 మంది అభ్యర్థులకుగాను 20945 మంది ఈ రాత పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లను, పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన వారిలో డిసిపిలు సునీల్ సుమిత్ గరుడ్, జి.నాగన్న, కె.ఆనంద రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ పరీక్షలకు రీజనల్ కో-ఆర్డినేటర్‌గా ఎసిపి డాక్టర్ ప్రేమ్ కాజల్, పర్యవేక్షక అధికారిగా ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు వ్యవహరించారు.

తీరానికి జన తాకిడి

వార్త 3లో..

ఘనంగా 'ఉక్కు' ఆవిర్భావ దినోత్సవం

వార్త 4లో..

ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

వార్త 3లో..

సముద్రంలో ఇద్దరు యువకులు గల్లంతు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అప్పుఘర్‌కు చెందిన ఇద్దరు యువకులు జాలరి ఎండాడ సమీపంలో సముద్ర స్నానానికి దిగి గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. మహా శివరాత్రి పండగ సందర్భంగా అప్పుఘర్‌కు చెందిన 20 మంది కుటుంబ సభ్యులు తమ సొంత పడవలో జాలారి ఎండాడ నుంచి బీచ్‌లోకి వెళ్లారు. సుమారు మూడు కిలోమీటర్ల సముద్రంలోనికి వెళ్లిన తర్వాత ఇంజిన్ ఆఫ్ చేసి అందులో కొంతమంది యువకులు సముద్రంలో స్నానానికి దిగారు. అందులోని ఇద్దరు యువకులు మద్యం మత్తులో సముద్రంలో మునిగి గల్లంతయ్యారు. గల్లంతయిన వారిలో ఉమ్మిడి అనిల్ (23), మరుపల్లి ప్రవీణ్ (21) ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎంవిపి స్టేషన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. యువకుల మృతితో అప్పుఘర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం

- సిపిఎస్ రద్దుకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కృషి
- గిరిజన ప్రాంతంలో జిఒ 3 చట్టబద్ధతకు పోరాటం
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ముందుంటా..
- 'ప్రజాశక్తి'తో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'వెనుకబడిన ఉత్తరాంధ్రకు అనాదిగా అన్యాయం జరుగుతోంది. వ్యవసాయం, వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో తగిన పురోగతిలేదు. ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగ యువత ఉపాధికి అవస్థలుపడుతోంది. రెగ్యులరైజేషన్ చేయక ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక ఎతలుపడుతున్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ అమలు చేయడంలేదు. ఎన్ఎడిబి ఇతర నిర్వాసిత సమస్యలు పరిష్కరించడంలేదు. షెడ్యూల్ ప్రాంతంలో జిఒ 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగాల భర్తీ చేయడంలేదు. ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దుచేయకుండా, రద్దుచేయాలని పోరాడుతున్న ఉద్యోగులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కష్టకాలంలో ఆదుకొనేందుకు సంక్షేమబోర్డు వంటివి లేవు. ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉత్తరాంధ్ర ప్రజల బాధనూ, ఘోషనూ, ఆవేదననూ, వివక్షనూ శాసనమండలిలో గొంతెత్తి, ఆయా తరగతుల సమస్యలపై పోరాడుతున్న శక్తులకు అండగా నిలబడతాను. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను' అని సామాజిక కార్యకర్త, 250 పైచిలుకు ప్రజా సంఘాలు బలపరిచిన



ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఎన్నికల అజెండా, విజయం సాధిస్తే కేంద్రీకరించి పనిచేసే అంశాలను వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఉన్నత చదువులు చదివి, ఉద్యోగావకాశాలను వదులుకొని సామాజిక సేవను ఎందుకు ఎంచుకున్నారు ?

మా కుటుంబ మిగతా 2లో..

'అహింస పరుగు' బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అహింస మార్గం ద్వారా ఏమైనా సాధించవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆదివారం ఆమె వాల్తేరు క్లబ్‌లో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెఐటిఒ) లేడీస్ వింగ్ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏప్రిల్ 2న జరిగే 'అహింస పరుగు' కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. విశాఖ నగరంలో ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ నుంచి మూడు విభాగాలుగా 3, 5, 10 కిలోమీటర్ల పరుగును నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెఐటిఒ లేడీస్ వింగ్ ఛైర్‌పర్సన్ ప్రేమ బేడీ, ప్రధాన కార్యదర్శి త్రిష హిరావత్, ప్రాజెక్ట్ కన్వీనర్ అజిత్ బోత్రా పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

చదువుకు పంపి చంపుకోలేం..

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు మృత్యువాత పడిన దేవీపట్నం మండలం ముసినిగుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు తమ పిల్లలను పంపేదిలేదనివిద్యార్థినుల తల్లిదండ్రులు గిరిజన సంఘం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు, ఆదివారం దేవీపట్నం మండలంలోని కచ్చులూరు, పెనికిలపాడు, మంటూరు, బీరంపల్లి కాలనీలో ఆదివారం గిరిజన సంఘం జిల్లా నాయకులు పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు,

ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ, ముసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల వ్యవధిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందడం బాధాకరమన్నారు. మరి కొంతమంది విద్యార్థినులు చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆ పాఠశాలకు తమ విద్యార్థినులను పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నా రన్నారు. తమ పిల్లలను పాఠశాలకు పంపి శవాలుగా మార్చలేమని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారని, వారి ఆక్రందనను అర్థం చేసుకోవాలన్నారు.

ఆశ్రమ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్, గిరిజన సంక్షేమ అధికారులు విద్యార్థినుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి దారుణమైన ఘటనలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. పిల్లలకు మెనూ ప్రకారం సరిగ్గా భోజనం పెట్టడం లేదని, వారి ఆరోగ్యం పట్ల కనీస శ్రద్ధ కనబరచడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ముసినిగుంట ఆశ్రమంలో విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో ఎఎన్ఎం నియమించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, హెల్త్ ఎమర్జెన్సీ ఫండ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు సాదాల విద్యాసాగర్ రెడ్డి, కుంజం బాపన్నదొర, కంభం శాంతి రాజు పాల్గొన్నారు.

'ఆనందమార్గ్'కు వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్ర భూములు, ఆస్తులు రిజిస్ట్రేషన్ విభాగానికి చెందిన పలువురు విశాఖ జిల్లా అధికారులు ఆదివారం సాయంత్రం పాత డెయిరీఫారం వద్ద ఉన్న ఆనందమార్గ్ చిల్డ్రన్ హోమ్ పిల్లలకు రూ.50వేలు విలువైన సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి బాలకృష్ణ మాట్లాడుతూ, పిల్లలు ఓర్పు, సహనం అలవర్చుకొని క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు. ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ మాట్లాడుతూ, వసతి గృహంలోని పిల్లలను ఎంతో ప్రేమ అభిమానులతో ఆనందమార్గ్ సంరక్షించడం అభినందనీయమన్నారు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహనరావు మాట్లాడుతూ, భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలనే విషయమై పిల్లల ముందుగానే నిర్ణయించుకుంటే మెరుగైన ఫలితాలు లభిస్తాయన్నారు. ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ గోపీచంద్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో సరైన మార్గంలో నడిచి మంచి స్థితికి చేరుకోవాలని పిల్లలకు సూచించారు. విశాఖ సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి మాట్లాడుతూ, ఏకాగ్రతతో విద్యను అభ్యసించి మంచి పౌరులుగా తయారుకావాలని కోరారు. ఆచార్య సౌమ్యానంద అవధూత మాట్లాడుతూ, చిల్డ్రన్ హోమ్ అభివృద్ధిని కోరుతూ సహాయం అందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ రమేష్, జువైనెల్ శాఖ ఇన్‌స్ట్రక్టర్ బాబూరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిన సీలేరు బస్సు

ప్రజాశక్తి - సీలేరు : నర్సీపట్నం డిపోకు నుంచి సీలేరు వెళ్లే ఆర్‌టిసి బస్సు ఆదివారం సాయంత్రం మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్ బ్రేకులు పాడై గేర్లు పనిచేయకపోవడంతో సీలేరులో బస్ నిలిచిపోయింది.

మొదటి పేజీ తరువాయి..

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం

నేపథ్యం అటువంటిది. గ్రామీణ వాతావరణంలో పెరగడం, చదువు పూర్తయ్యాక గిరిజన, నగర, శ్రామిక మహిళల సమస్యలను అధ్యయనం చేస్తూ, పరిష్కారం కోసం పనిచేశాను. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో అగ్రికల్చర్ బిఎస్సీ పూర్తిచేశాక పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతంలో పనిచేశాను. కొండల్లో గిరిజనుల నివాసాలు, వారి భాషలు, సంప్రదాయాలు, సంస్కృతి, ప్రకృతిపైనా ఆసక్తివుండడంతో గిరిజన ప్రాంతం ఎంచుకున్నాను. గిరిజన గూడెల్లో వారితోపాటు ఉంటూ జీడి మామిడి తోటల పెంపకంపై అవగాహన కల్పించడం, వారితో కలిసి తోటలు పెంపకంలో భాగస్వామి అయ్యాను. గుమ్మలక్ష్మీపురం ప్రాంతంలో నాణ్యమైన జీడిపిక్కల విత్తనాల కోసం పెద్ద పోరాటం నడిపి, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయించగలిగాను. 'మేనేజ్' అనే సంస్థ ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులో రంపచోడవరంలోని గిరిజన ప్రాంతంలో పనిచేసినప్పుడు గిరిజన వ్యవసాయంలో చిరుధాన్యాల పంటలకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేశాను. వివాహ రీత్యా విశాఖ నగరానికి రావడంతో.. ప్రభుత్వ ఉద్యోగం కాకుండా, పేదలకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల్లో పనిచేయాలని అనుకున్నాను.

మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలేంటి?

వ్యవసాయం, వ్యవసాయ పనిచేస్తున్న వారితోవున్న అనుబంధం, అన్నయ్య, అక్క, తమ్ముడు విద్యార్థి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాల్లోనూ పనిచేయడం, దీనికితోడు బొబ్బిలి మండలం నారసింహునిపేట సర్పంచ్‌గా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన మా తాతగారు మర్రాపు పోతినాయుడు ప్రభావం నాపై బలంగా పడింది. బాల్యంలో ఆయన దగ్గర పెరగడం, చదవడంతో దళితులు, ఇతర సామాజిక తరగతులను ఆయన ప్రేమగా, సమానంగా చూడ్డం అతిసమీపం నుంచి చూశాను. ఉపాధ్యాయులు బాగుంటే, పిల్లలకు విద్యాబోధన బాగుంటుందని ఉపాధ్యాయుల పట్ల చాలా అభిమానం చూపేవారు. నా బాల్యం నుంచే ప్రభావితం కావడానికి ఇవన్నీ దోహదపడ్డాయి.

మీరు చేసిన ప్రధాన సేవా కార్యక్రమాలేంటి?

వివాహరీత్యా విశాఖ నగరానికి రావడంతో జాతీయ స్వచ్ఛంద సంస్థ 'ధాన్ ఫౌండేషన్'లో రెండు దశాబ్దాలకుపైగా పనిచేశాను. నా ఆలోచనలకు తగినట్లే పేదరిక నిర్మూలన, రైతులు, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై పనిచేసే క్రమంలో 33 వేల మంది పేద మహిళలతో స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా సమాఖ్యలను ఏర్పాటు చేశాను. ఈ క్రమంలో బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ సంస్థలు, ఆరోగ్య సంస్థలు, వృత్తి శిక్షణ సంస్థలతో అనుసంధానం చేసుకొని పేద మహిళలకు, వారి కుటుంబాలకు సేవలందించాను. అంగన్‌వాడీ, ఆశా, శ్రామిక మహిళలు పనిచేసే ప్రాంతంలో వారెదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా పనిచేశాను. మెటర్నిటీ లీవ్ సదుపాయం, లైంగిక వేధింపుల కమిటీలు, ప్రత్యేక మరుగుదొడ్లు వంటి ఏర్పాటు చేయగలిగేలా చేశాను. ఎస్ఇజెడ్‌లో గార్మెంట్ కార్మికుల సమస్యలపై పనిచేసినప్పుడు భారత ప్రతినిధిగా ఆసియా దేశాల్లో వారి సమస్యలపై మాట్లాడాను. నా జీవిత భాగస్వామి డాక్టర్ బి.గంగారావు ప్రజలకు సేవచేసే వ్యక్తి కావడంతో నా సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నాను. 2010 నుంచి మురికివాడల్లోని పేద కుటుంబాల పిల్లల కోసం వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ (విసిసి) ఏర్పాటుచేశాను. పిల్లల్లో సమిష్టితత్వం పెంచడం, సామాజిక స్పృహ, శాస్త్రీయ ఆలోచనలు వారిలో పెంపొందించడం సంతృప్తినిచ్చాయి. పేద కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా ట్యూషన్ సెంటర్లు నడుపుతున్నాం.

మీ ఎన్నికల ప్రచార అజెండా ఏంటి?

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే ప్రధాన ప్రచార ఎన్నికల అజెండా. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధిలో ఈ ప్రాంతం వెనుకబడివుంది. వ్యవసాయం అభివృద్ధి చెందకపోవడంతో వెనుకబాటుతనం కొనసాగుతోంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీ అమలుచేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చిన్ననీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి. కొత్త పరిశ్రమలు రావాలి. ఐటి హబ్‌ని అభివృద్ధి చేయాలి.

మీరు విజయం సాధిస్తే ఏ సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తారు?

నా అభ్యర్థిత్వాన్ని బలపర్చి పనిచేస్తున్న 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజాసంఘాల సమస్యలు పరిష్కారానికి, ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీకి కృషి చేస్తాను. విభజన చట్టం హామీల అమలుకు కృషిచేస్తాను. పెట్రోలియం, గిరిజన యూనివర్శిటీ పూర్తికి, మెట్రో రైల్, రైల్వే జోన్‌పై మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాను. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా జరుగుతున్న పోరాటాలకు అండగా వుంటాను. సొంత గనులు సాధనకు కృషి చేస్తాను. సిపిఎస్ రద్దుకు ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు అండగా వుంటాను. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీకి కృషి చేస్తాను.

సెజ్‌లో పరిశ్రమలకు రాయితీలు కల్పించినట్లు, ఉపాధి కేంద్రాలుగావున్న చిన్నచిన్న విద్యా సంస్థలకు రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరుతాను. గిరిజన ప్రాంతంలో జిఒ 3 ప్రకారం ఉద్యోగాల భర్తీచేయాలి. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసేలా పట్టుబడతాను. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తాను. విశాఖలో పంచగ్రామాల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తాను. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై ఉత్తరాంధ్ర ఆడపడుచుగా నీతి, నిజాయతీ, నిబద్ధతతో మండలిలో పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మికులు, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తాను.

వారికి ఎన్నికల కోడ్ పట్టదా ?

చేశారు. ఎన్నికల నియమావళిని ధిక్కరించిన వైసిపి అభ్యర్థి సుధాకర్‌కు ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేదన్నారు. ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయకుండా నిరసన తెలియజేసిన ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వైసిపి తన అధికారాన్ని ఉపయోగించుకొని ఎన్నికల్లో దుర్వినియోగానికి పాల్పడాలని చేస్తే విద్యావంతులైన పట్టభద్రులు చూస్తూ ఊరుకోరని, తగిన బుద్ధి చెబుతారని తెలియజేశారు. ప్రజాస్వామ్యయుతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఓటర్లను ప్రభావితం చేసేలా విసి చర్యలు

అధికార దుర్వినియోగంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన అజశర్మ



మాట్లాడుతున్న అజశర్మ

ఎయు విసి పివిజిడి.ప్రసాద్ రెడ్డి వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో ఓ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి, దానికి ఆ పార్టీ అభ్యర్థిని, ఇతర అధికార పార్టీ నాయకులను పిలిచారని, ఇది అధికార దుర్వినియోగం తప్ప మరొకటి కాదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. సమావేశం ఏర్పాటు చేసిన ఎయు విసి ప్రసాద్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. విసి ప్రసాద్ రెడ్డి గతంలో అనేక సందర్భాల్లో తన హోదాను మరిచి, అధికార పార్టీ ఏజెంటుగా వ్యవహరించిన సందర్భాలున్నాయన్నారు. నేడు మరీ బరితెగించి ఈ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఇది ఆయనకున్న రాజ్యాంగ పదవిని దుర్వినియోగపరచడమేనని, ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని, ఎన్నికలయ్యే వరకు ఆయనను ఆ పదవి నుండి తొలగించాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశం జరిగిన హోటల్‌లోని సిసి టీవీ కెమెరా పుటేజీలను వెంటనే స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

విసి వ్యవహారం దారుణం : ఎస్ఎఫ్ఐ

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎయు విసి ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌ల చర్యను ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ ఖండించింది. ఈ మేరకు వర్సిటీ కార్యదర్శి సూర్య మాట్లాడుతూ విసి హోదాలో ఉన్న వ్యక్తి రాజకీయ పార్టీ ప్రయోజనాల కోసం పని చేయడం సిగ్గుచేటన్నారు.

సిసి పుటేజీల ఆధారంగా చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఎయు విసి, రిజిస్ట్రార్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఈ మేరకు సంఘం నగర కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. మీటింగ్ నిర్వహించిన సమావేశ మందిరంలోగల సిసి పుటేజీలను స్వాధీనం చేసుకోవాలన్నారు.

ఎయును వైసిపి కార్యాలయంగా మార్చిన విసి : టిడిపి

ఆంధ్రా యూనివర్సిటీని విసి ప్రసాద్‌రెడ్డి అధికార వైసిపి కార్యాలయంగా మార్చి వేశారని టిడిపి మాజీ ఎమ్మెల్సీ ఎఎస్.రామకృష్ణ అన్నారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయు విసి, వైసిపి నాయకులు రహస్య సమావేశం నిర్వహించడం దారుణమన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆదివారంతో ముగిశాయి. 14 ఏళ్ల లోపు బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లా బాలుర జట్టు విజయనగరంపై 11-8 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. రెండు, మూడు స్థానాల్లో విజయనగరం, కర్నూలు జట్లు నిలిచాయి.

విజయనగరం జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టు చిత్తూరుపై 10-9 పాయింట్ల తేడాతో గెలుపొందింది. చిత్తూరు, విశాఖ జిల్లాల జట్లు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

విశాఖ జిల్లా బాలుర నుంచి పి.లక్ష్మీదర్, విజయనగరం జిల్లా బాలికల నుంచి పి.భారతి ఆల్ రౌండ్‌లో నిలిచారు. వీరిద్దరికీ జ్ఞాపిక, ఎస్‌జిఎఫ్ నుంచి చెరో రూ.500 ప్రోత్సాహక నగదు బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు జ్ఞాపికలు అందజేశారు. బాలికల జట్టులో 12 మందిని, బాలుర జట్టులో 12 మందిని జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పంపించనున్నారు. దాదాపుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మంది బాలురు, బాలికలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ని హెచ్.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. గెలుపు ఓటములను ఒకేలా స్వీకరించాలని క్రీడా కారులకు సూచించారు. సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల కో-ఆర్డినేటర్ ట్రెసా మేరీ, పర్యవేక్షకులు సుబ్బారావు, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుల విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కె.సతీష్, కెఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు



విజేతగా నిలిచిన విశాఖ జిల్లా బాలురు జట్టు

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కె.కోటపాడు : జెసిబి తొట్టే తగిలిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన జోగన్నపాలెంలో చోటుచేసుకుంది. కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్ వెల్లడించిన వివరాల ప్రకారం జోగన్నపాలెం గ్రామానికి చెంది నక్కెళ్ళ దేముడు (75) శనివారం రాత్రి శివరాత్రి పూజలు చేసుకుని, ఇంటికి వెళతుండగా అదే గ్రామానికి చెందిన బండారు వకీలుకు చెందిన జెసిబి బకెట్‌కు తగిలి కింద పడి మృతి చెందాడు మృతుని. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



బాలసుబ్రహ్మణ్యంను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న లలితారాణి

బాలుకు కృష్ణదేవరాయల అవార్డు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం ప్రాంతానికి చెందిన సామవేదం బాలసుబ్రహ్మణ్యంనకు(బాలు) కృష్ణదేవరాయలు అవార్డుతో ఈ నెల 18న కర్నాటకలో ఘనంగా సత్కరించారు. కర్నాటక రాష్ట్రం విజయనగరం జిల్లా హంపీలోని బలిజభవన్ ఫంక్షన్ హాలులో శనివారం ప్రైడ్ ఇండియా కల్చకల్స్ సిఇఒ డాక్టర్ కోలా వెంకటేశ్వరరావు, సిటిజన్ వెల్ఫేర్ ఫోరమ్ సయుక్తంగా నిర్వహించిన ఈ అవార్డు ప్రదానం మహాశివరాత్రి సందర్భంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీకృష్ణదేవరాయులు వంశీయులు లలితారాణి శ్రీరంగదేవరాయులు, కర్నాటక టూరిజిమ్ శాఖా మంత్రి ఆనంద్‌సింగ్ సమక్షంలో బాలసుబ్రహ్మణ్యంను సత్కరించి, అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పద్మనాభం మండలం, మద్ది గ్రామానికి చెందిన తనను కర్నాటకలో జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమములో కర్నాటక ఉడా చైర్మన్ ఎల్‌డి జోషి, కర్నాటక ధార్మిక దత్తి హిల్ ఎన్‌టి.రాజు, టిబికె జెఎసి, దాసరి రాము తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

ప్రజాశక్తి -మధురవాడ : నటుడు నందమూరి తారకరత్నకు జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరిపైనున్న గిరిజన కాలనీ ప్రజలు సత్తెమ్మ తల్లి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సతివాడ శంకరరావు, జెర్రిపోతుల నరసింహామూర్తి, గిరిజన పెద్ద సన్యాసిరావు పాల్గొన్నారు.

3న సీతారామస్వామి వార్షిక కల్యాణోత్సవం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం కొండపైన గంగధార వద్ద సీతారామస్వామి ఆలయంలో మార్చి 3వ తేదీన వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2వ తేదీన అంకురార్పణతో ప్రారంభమై 8వ తేదీ కల్యాణోత్సవ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఐఎస్‌ఒ గుర్తింపు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరంలో ఉన్న అక్షయపాత్ర కేంద్రీకృత వంటశాలకు ఐఎస్ఒ 22000:2018 గుర్తింపు లభించింది. జగనన్న గోరుముద్ద, ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆనందపురం, భీమిలి మండలాల్లోని 174 పాఠశాలలో 20560 మంది పిల్లలకు ప్రతిరోజూ పరిశుభ్రంగా తయారు చేయడం ద్వారా ఈ గుర్తింపు వచ్చినట్లు అక్షయపాత్ర గంభీరం కిచెన్ ప్రెసిడెంట్ అంబరీస్ దాస్ తెలిపారు. ఈ వంటశాల ఏర్పాటుకు స్థలం అందించిన డాక్టర్ ఎస్‌వి ఆదినారాయణరావుకు, వంటగది నిర్మాణానికి నిధులు సమకూర్చిన దివీస్ లేబొరేటరీకి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

పలు గ్రామాల్లో అన్నదానం

ప్రజాశక్తి-పద్మనాభం : శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకోని మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం, మద్ది, అనంతవరం, గంధవరం గ్రామాల్లోని శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రోగి ఎక్కడున్నా... వైద్యుల పర్యవేక్షణ

ఎమ్‌బి ఆసుపత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణుప్రసాద్

ప్రజాశక్తి - ఆరిలోవ : రోగి ఎక్కడున్నా సరే వైద్యుల పర్యవేక్షణ సాధ్యమయ్యే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ ఆసుపత్రిలో తీసుకొచ్చినట్టు ఎమ్‌బి ఆసుపత్రి అధినేత డాక్టర్ విష్ణుప్రసాద్ తెలిపారు. ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఎమ్‌బి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక రిమోట్ పేషెంట్ మోనిటరింగ్ మెడికల్ టెక్నాలజీని భారతదేశంలోనే మొట్ట మొదటి సారిగా ఎమ్‌బి ఆసుపత్రిలో విజయవంతంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. చిన్నపాటి వైర్‌లైస్ డివైజ్‌తో మనిషిలోని గుండె నాడి, ఆక్సిజన్ శాతం, ఇసిజి, రక్తపోటు, శరీర ఉష్ణోగ్రత, సుగర్ లెవల్స్ తదితర ముఖ్యమైన డేటాను తెలుసుకోవచ్చన్నారు. ఈ చిన్నపాటి డివైస్‌లను రోగికి అతికించడం ద్వారా ఆసుపత్రిలో గాని, అంబులెన్స్‌లో గానీ, సుదూర ప్రాంతంలో ఉన్నా సెంట్రల్ మోనిటరింగ్ సిస్టమ్ ద్వారా ఆసుపత్రిలోని వైద్యులు తగిన వైద్య సూచనలు, దగ్గరలో ఉన్న వైద్యుని ద్వారా సంబంధిత వ్యక్తికి చికిత్స అందించేలా అప్రమత్తం చేయవచ్చని పేర్కొన్నారు. ఐసియులో ఉన్న రోగిని బయట నుంచి పర్యవేక్షించవచ్చన్నారు. అంబులెన్స్‌లో కూడా ఈ సౌకర్యం ఉండడం వల్ల రోగి ఇంటి వద్ద బయలుదేరే సమయం నుంచి తగిన సూచనలు వైద్య సిబ్బందికి అందించవచ్చని తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జి 20 గ్లోబల్ టెక్ సమ్మెట్‌లో దేశవిదేశ, కార్పొరేటర్ ప్రతినిధులకు వివరించామని తెలిపారు. ఈ సమావేశంలో న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణ రాజీవ్, ఆర్థో రోబొటెక్ సర్జన్ డాక్టర్ జ్ఞానేశ్వర్‌రాజ్, ఎక్మో నిపుణులు డాక్టర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

తీరానికి తాకిడి

▸▸సందడిగా సముద్ర స్నానాలు ▸▸విస్తృతంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి జాగారం చేశాక ఆదివారం తెల్లవారుజామునుంచి సాగరతీరంలో స్నానాలు చేసేందుకు భక్తులు పోటెత్తారు.

భీమునిపట్నం : భీమిలి తీరంతోపాటు తిమ్మాపురం, మంగమారిపేట తీరంలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సముద్ర స్నానాలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జివిఎంసి, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. స్నానాలు చేసే క్రమంలో ప్రమాదాలు వాటిల్లకుండా ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. స్నానాలకు సముద్రం లోపలకు వెళ్ళొద్దంటూ తరచూ పోలీసులు మైక్ ప్రచారం చేశారు. జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, యుసిడి ఎపిడి ఎల్.రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు వారి వారి సిబ్బందితో బీచ్‌లో ఏర్పాట్లు పర్యవేక్షించారు. సిఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జివిఎంసి ఆధ్వర్యాన తాగునీరు, బీచ్ వద్ద స్నానాలు చేసిన తర్వాత మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తాత్కాలికంగా పరదాలతో ఏర్పాట్లుచేశారు. ప్రజా పిత బ్రహ్మా కుమారి ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యాన స్థానిక లైబ్రెరీ వద్ద శివలింగాన్ని, నందిని, అమృత లింగ దర్శనం నిమిత్తం ఏర్పాటు చేశారు. బ్రహ్మ కుమారిలు వేణి, సునీత, లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

ప్రసాదాల వితరణ

జివిఎంసి నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆధ్వర్యాన మంగమారిపేట, చేపలుప్పాడ వద్ద రెండు కౌంటర్లు ఏర్పాటుచేసి చక్ర పొంగలి, పులిహోర, దద్దోజనం భక్తులకు పంపిణీ చేశారు.

మధురవాడ : రుషికొండ వద్ద జనసేన నాయకులు సందీప్ పంచకర్ల, శాఖరి శ్రీనుబాబు ఆధ్వర్యాన భక్తులకు మజ్జిగ పంపిణి చేశారు. ఐటి సెజ్ వుడా కాలనీ రోడ్డులో మానం ఆంజనేయులు నగర్‌లో గల శ్రీ లలిత త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వరస్వామి దేవాలయం ధర్మ కర్త బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యాన భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

ఆనందపురం: ఆనందపురం మండలం గుడిలోవలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో మండల జనసేన పార్టీ నాయకుల మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన సభ్యత్వం ద్వారా వచ్చే ప్రమాద బీమా పాలసీ గురించి భక్తులకు వివరించారు. కొంతమంది భక్తులతో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చందల అప్పలరాజు, భీమిలి ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల, దుక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని శివాజీ పార్క్

పట్టించుకోని జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి హెచ్.బి.కాలనీలోని శివాజీపార్కు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ పార్కును అభివృద్ధి చేయకపోవడంతో లోపల పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారింది. ఈ సర్పాలు చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యాన్ని తాగి, సీసాలను విసిరివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ పార్కు న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉన్నప్పటికీ రాత్రి సమయంలో హెచ్చరించిన సందర్భాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కు అభివృద్ధి పనులకు గతంలో రూ.25 లక్షలకు టెండర్ ఖరారైంది. ఒక కాంట్రాక్టర్ ముందుకు వచ్చి రూ.10 లక్షలు ఖర్చు చేసి సగం వరకు రన్నింగ్ ట్రాక్, నీటి బోరును ఏర్పాటుచేశారు. మిగతా పని చేయకుండా సంబంధిత కాంట్రాక్టర్ పనులు మధ్యలో విడిచిపెట్టేశారు. అలాంటి కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన జివిఎంసి ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు ఆ విధమైన చర్యలు చేపట్టలేదు. ఈ పార్కు వినియోగంలోకి వస్తే హెచ్.బి.కాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, నడుపూరు, పాత అయ్యన్నపాలెం ప్రజలకు వాకింగ్, క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానికుల చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మూలకు చేరిన బోరు



చెరువులో నీరు వెళ్లకుండా వేసిన ఇసుక బస్తాలు

తోకాడ చెరువుకు తాత్కాలిక మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -గాజువాక : తోకాడ శ్మశాన వాటిక చెరువుకు జివిఎంసి అధికారులు తాత్కాలిక మరమ్మతుల పనులు చేపట్టారు. 'గట్టు తెగిన తోకాడ చెరువుతో అవస్థలు' శీర్షికన ఈ నెల 17వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, ఎఎంహెచ్ఒ స్పందించారు. చెరువు గట్టు తెగిన దగ్గర ఇసుక బస్తాలు వేసి నీరు అపార్ట్‌మెంట్లవైపు వెళ్లకుండా నిలుపుదల చేశారు.

58 ఏళ్ల మహిళకు అత్యాధునిక శస్త్రచికిత్స

ప్రజాశక్తి -గాజువాక : పెరియాంప్యుల్లరీ కలిపి కేన్సర్ వచ్చిన రోగికి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ఊరట కల్పించారు. ఆమె సమస్యను, చికిత్స వివరాలను ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రసాద్ ఎర్రా మీడియాకు వివరించారు. 'విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 58 ఏళ్ల సరస్వతి బరువు తగ్గడం, కామెర్లు, శరీరంపై దురదలు సమస్యతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు వివిధ వైద్యపరీక్షలు చేయగా, పెరియాంప్యుల్లరీ కార్సినోమా వ్యాధిగా తేలింది. పాంక్రియాస్ (క్లోమం)తో పాటు పిత్తనాళం (బైల్ డక్ట్), ఆంత్రమూలం (డువోడినమ్) తదితర ప్రాంతాలకు కేన్సర్ వ్యాపిస్తే దాన్ని పెరియాంప్యుల్లరీ కార్సినోమా అంటారు. సాధారణంగా పాంక్రియాస్‌కు కేన్సర్ సోకితే శస్త్రచికిత్స చేయడమే చాలా సంక్లిష్టం. అయినా, దీన్ని కూడా కేవలం ఉదరభాగంలో చిన్న రంధ్రాలు మాత్రమే చేసి లాప్రోస్కోపిక్ పద్ధతిలో శస్త్రచికిత్స చేశాం. దీన్ని విపుల్ పాంక్రియాటికో డియోడెనెక్టమీ అంటారు. ఇది చాలా అత్యాధునికమైన పద్ధతి. మొత్తం ఏడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి, కేన్సర్ సోకిన భాగాలన్నింటినీ పూర్తిగా తొలగించాం. సర్జరీ తరువాత 8 రోజుల్లో పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జ్ చేశాం. ఇప్పటి వరకు ఐదు లాప్రోస్కోపిక్ విపుల్ ప్యాంక్రియాటికోడ్యుడెనెక్టమీ సర్జరీస్ చేశాం' అని డాక్టర్ వివరించారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డివైఎఫ్ఐ కమిటీ సభ్యులు

ఆటల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి ములగాడ : : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 59వ వార్డు హనుమాన్ నగర్ కమిటీ ఆధ్వర్యాన శివరాత్రి సంబరాల సందర్భంగా పరుగు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, ముగ్గుల పోటీ, ఉండమ్మ బొట్టు పెడతా తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది పాల్గొన్నారు. 15 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం డివైఎఫ్ఐ హనుమాన్ నగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జె.ఈశ్వరరావు,మోహన్ మాట్లాడుతూ, పిల్లలలో ఉన్న నైపుణ్యం వెలికితీయడానికి పండగల సందర్భంగా ఆటలు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నర్సమ్మ నారాయణ, లీలమ్మ, కృష్ణ, సత్యం, భవాని, పాపినాయుడు ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అర్జున్, కుమార్, నవీన్, కనకరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

48 మంది గీతం నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ద్వారా బిఎస్సీ నర్సింగ్ కోర్సు అభ్యసిస్తున్న 48 మంది విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగాలు లభించినట్లు గీతం కేరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీ కిరణ్ సోమయాజుల తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులు కాంటినెంటల్, మెడికవర్, ఇండస్ హస్పిటల్స్ ఈ ప్రాంగణ నియామకాలను నిర్వహించాయని ఆయన వెల్లడించారు. న్యూఢిల్లీలోని రాజీవ్ గాంధీ కేన్సర్ ఆసుపత్రి, ప్రముఖ పట్టణాలలో విస్తరించిన అపోలో ఆసుపత్రి త్వరలో గీతం నర్సింగ్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలను నిర్వహించడానికి ఆసక్తి కనబరిచాయని తెలిపారు.

ఘనంగా కె.విశ్వనాథ్ జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ దర్శకులు, సినీ నటుడు కె.విశ్వనాథ్ జయంతిని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత తారకరత్న మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం విశ్వనాథ్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన స్వాతి ముత్యం, సిరివెన్నెల సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ఎంవి.రఘును ఈ సందర్భంగా సత్కరించారు. సీనియర్ నటులు ఎస్‌కె.మిశ్రా అతిథిగా పాల్గొని విశ్వనాథ్‌తో గల జ్ఞాపకాలను పంచుకున్నారు. విశ్వనాథ్ దర్శకత్వంలోని పలు చిత్రాల్లో నటించానని తెలిపారు. ముఖ్య అతిథి ఎంవి.రఘు మాట్లాడుతూ, విశ్వనాథ్‌తో పనిచేయడం గొప్ప అనుభూతి అన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన, కృషి, స్పష్టత, గుణాలు విశ్వనాథ్ నుంచి నేర్చుకున్నామని చెప్పారు. వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, త్వరలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించే ఆలోచన ఉందని తెలిపారు. అనంతరం స్వాతిముత్యం సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్ఎడి పాల్, బి.చిన్నారావు, కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

త్రినాధపురంలో పరస

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి త్రినాధపురం జంక్షన్‌లో శివరాత్రి మహోత్సవాల సందర్భంగా పరస నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి, విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ప్రజానాట్యమల్లి నాయకులు పూడి లెనిన్, విసిసి జోన్ కన్వీనర్ ఇ.అరుణ ఆధ్వర్యాన నృత్య ప్రదర్శనలు, జానపద గేయాల ఆలాపన జరిగాయి. ఈ సందర్భంగా లెనిన్, అరుణ మాట్లాడుతూ, మన తెలుగు జానపద సంప్రదాయాలను కాపాడుకోవాలని, మతోన్మాద విష సంస్కృతిని పారద్రోలాలని పిలుపునిచ్చారు. త్రినాధపురం, క్రాంతినగర్ విసిసి పిల్లలకు కళారూపాల శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్న ఇల్లపు అచ్యుతరావు, పి.సూర్యనారాయణకు అభినందనలు తెలిపారు. త్రినాధపురం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు జె.గంగరాజు, పి.రామారావు, గ్రామపెద్దలు బంకురు జగ్గునాయుడు, నీలం రాజు, డి.సన్యాసిరావు, బి.రామారావు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

600 మంది రక్తదానం

ప్రజాశక్తి-కంచరపాలెం : గోపాలపట్నంలోని విశాఖ పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పేతకంశెట్టి అప్పలనరసింహం 87వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన ఆదివారం ఉదయం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 600 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మెడికవర్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ పద్మజ, సోషల్ యాక్టివిస్ట్ ఐవిఎస్.భాగ్యలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులుగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, దువ్వారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని గోస్తనీస్కూల్ ప్రాంగణంలో శివరాత్రిని పురస్కరించుకొని వైసిపి ఆధ్వర్యాన నియోజక వర్గ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం రాత్రి నిర్వహించారు. ఎంపిపి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ టోర్నమెంటులో 60 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్షణరావు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉక్కు' ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉక్కునగరంలోని ఉక్కు క్లబ్ మల్టీ పర్పస్ హాల్‌లో డైరెక్టర్లు, కమాండెంట్‌లతో కలిసి సిఎండి అతుల్‌భట్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉక్కునగరం పాఠశాలల విద్యార్థులు స్వాగత నృత్యంతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం సిఎండి అతుల్‌భట్ మాట్లాడుతూ, అద్భుతమైన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్లాంట్ నిర్మాణంలో త్యాగజీవులను, ఉక్కు కర్మాగార స్థాపనలో పాల్గొన్న వారందరినీ కృతజ్ఞతతో స్మరించుకుందామన్నారు. ఆర్ఐఎన్ఎల్‌ను అత్యంత ప్రాధాన్య ఉక్కు కంపెనీగా మార్చే సంప్రదాయాన్ని కొనసాగించే గొప్ప బాధ్యత మనందరి భుజాలపై ఉందన్నారు. సిబ్బంది అభిరుచి, అంకితభావం, స్ఫూర్తితో ఆర్ఐఎన్ఎల్ జెండాను మరింత ఎత్తుకు ఎగిరేలా చేయగలమన్న ధీమా తనలో ఉందని పేర్కొన్నారు. 2023ని ఆర్ఐఎన్ఎల్‌కు మరపురాని సంవత్సరంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేద్దాం అన్నారు. కంపెనీ మరింత అభివృద్ధి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి మనల్ని మనం పునరంకితం చేసుకుందామని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 20న రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల నుంచి 16,250 టన్నుల రోజువారీ ఉత్తమ ఉత్పత్తి, బిఎఫ్ 1,2 నుంచి ఉత్తమ నెలవారీ హాట్‌మెటల్ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో సాధించిన సిబ్బందిని ప్రశంసించారు. జనవరిలో 108 శాతం సామర్థ్య వినియోగంతో, ఎక్స్‌పాన్షన్ మిల్స్ నుంచి ఉత్తమ నెలవారీ ఉత్పత్తి అయిన ఫినిష్డ్ స్టీల్ మొదటి సారిగా రేటింగ్ రేట్ కెపాసిటీని దాటిందని తెలిపారు. ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలీలో ఫోర్జ్డ్ వీల్ ప్లాంట్ నుంచి భారతీయ రైల్వేకి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లోకో, ఎల్‌హెచ్‌బి చక్రాలను కఠినమైన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తి చేస్తున్నందుకు సిబ్బందిని ప్రశంసించారు.

ఆర్ఐఎన్ఎల్ సమిష్టి అంకితభావంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక గుర్తింపులు వచ్చాయన్నారు. వరుసగా నాలుగోసారి నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు, 2017 నుంచి వరుసగా ఆరోసారి ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్ అవార్డును వరించినట్లు తెలిపారు. గోద్రేజ్ గ్రీన్ బిజినెస్ సెంటర్, గ్రీన్‌టెక్ కార్పొరేట్ గవర్నెన్స్ అవార్డు 2022 కార్పొరేట్ గవర్నెన్స్ రంగాలలో అద్భుతమైన పనితీరుకు, పరిశ్రమ, రంగాలలో అసాధారణమైన వృత్తిపరమైన విజయాలు సాధించినందుకు 16వ ఐసిఎఐ అవార్డులలో డైరెక్టర్ (ఫైనాన్స్) వివి.వేణుగోపాలరావుకు ఐసిఎఐ అవార్డు, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ 2022, ఇండోనేషియాలోని జకార్తాలో లీన్ క్వాలిటీ సర్కిల్ టీమ్‌ల ద్వారా 3 ప్రతిష్టాత్మక గోల్డ్ అవార్డులు, క్యుసిఎఫ్ఐ ద్వారా క్వాలిటీ కాన్సెప్ట్‌లపై చాప్టర్ కన్వెన్షన్-2022లో 'గోల్డ్ అవార్డ్స్' సాధించినందుకు సిబ్బందిని ప్రశంసించారు. ఆవిర్భావం సందర్భంగా సెంట్రల్ డిస్పాచ్ యార్డ్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



ఆవిర్భావదినోత్సవంలో మాట్లాడుతున్న సిఎండి అతుల్‌భట్

అవార్డులు

ప్లాంట్‌లో ఎంపికచేసిన ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 96 మందికి జవహర్ నెహ్రూ అవార్డులను అతుల్ భట్ అందించారు. కఠోర శ్రమ, విధినిర్వహణలో కర్తవ్య దీక్ష ప్రదర్శించినందుకు 21 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బందికి ప్రశంసా పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ అన్ని విభాగాల అధికారులు, కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 20 ఫిబ్రవరి 2023

ప్రమాదభరిత కల్వర్టును పట్టించుకోరా..?

- హెచ్చరిక బోర్డు పెట్టేందుకైనా అతీగతీ లేదు...
- అధికారులు, నేతల నిర్లక్ష్యంపై పలువురి మండిపాటు



వెంకన్నపాలెం కల్వర్టు వద్ద చిరిగిపోయిన హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి సమీపంలో ప్రధాన రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టుపై అధికారులు, నేతల నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. అత్యంత రద్దీగా ఉన్న మార్గంలో రక్షణ గోడలు కూలి, ఎటువంటి హెచ్చరికలు లేకుండా ఉన్న కల్వర్టును నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులకు అనేక మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని పరిస్థితుల్లో స్థానిక యువత సామాజిక స్పృహతో ప్రమాదాలకు గురికాకుండా వాహనదారులను అలెర్ట్ చేసేందుకు దాదాపు ఆరు నెలల క్రితం పెద్ద కర్రలకు ప్రమాద హెచ్చరికగా ఫ్లెక్సీని కట్టారు. ఈమార్గంలో అనునిత్యం ప్రయాణించే అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ బాధ్యతను గుర్తు చేయడం, వాహనదారులకు ప్రమాద హెచ్చరికగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ఆరునెలలు దాటతంతో అది కాస్తా చిరిగి పోతోందే తప్ప, అధికారులు, నేతల్లో ఎటువంటి కదలిక లేదు.

చోడవరం నుండి అనకాపల్లి , వెంకన్నపాలెం మీదుగా విశాఖపట్నం వెళ్లే బస్సులు, మంత్రులు, అధికారులు, ఇతర నేతల కార్లు ఇతర ప్రత్యేక వాహనాలు ఇదే మార్గంలో నిత్యం తిరుగుతున్నా వారికి ఈ ప్రమాదహెచ్చరిక ఫ్లెక్సీ కనబడలేదో, లేకుంటే, మాకేందుకులే అన్న నిర్లక్ష్యంతో పట్టించుకోవడం లేదో అంతు పట్టడం లేదని స్థానికులు, యువత మండిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక మేలుకునే కంటే, ముందుగానే కల్వర్టు వద్ద రక్షణ గోడ, ఇతర ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

112వ రోజుకు నాబ్ నిర్వాసితుల దీక్ష

ప్రజాశక్తి - రాంబిల్లి : తమ సమస్యల పరిష్కారం కోరుతూ నేవల్ బేస్ నిర్వాసిత మత్స్యకారులు నాబ్ మెయిన్‌గేటువద్ద చేపడుతున్న దీక్షలు ఆదివారం 112 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి నేతలు మాట్లాడుతూ, నిర్వాసిత మత్స్యకారుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలకు స్పష్టమైన పరిష్కారం లభించేవరకు దీక్షలను విరమించేది లేదని , ముమ్ముందు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షాశిబిరంలో ఎనిమిది గ్రామాల మత్స్యకారులు, నిర్వాసితులు,జెఎసి నేతలు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యంతో మంచి గుర్తింపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ రమేష్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : క్రీడల్లో పాల్గొనడం, రాణించడం ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకోవడంతోపాటు ఉన్నతమైన భవిష్యత్తు వస్తుందని మార్టూరు సర్పంచ్ కెకె.రమేష్‌బాబు అన్నారు.

మార్టూరు గ్రామం నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కెవిఆర్ బ్యాచ్ ఆర్థిక సాయంతో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం రెండవ రోజున కొనసాగాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ, క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. క్రికెట్ పోటీల విజేతలకు రూ.20వేలు, రన్నరప్‌కు రూ.12వేలు, మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.8వేలు ఆర్థిక బహుమతులను అందజేస్తామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు కెవి.రమణ వెల్లడించారు

ఆదివారం పోటీల్లో పూడిమడక, వెంకటాపురం, పూడి, ఎర్రవరం, ఎలమంచిలి, లాలంకోడూరు, మార్టూరు, పంచదారల భోగాపురం గ్రామాలకు చెందిన క్రికెట్ జట్లు పోటీపడ్డాయి. పోటీలను జి చిరంజీవి, గొన్న వెంకటేష్, కలం త్రిమూర్తులు, కలం పోతురాజు, గుర్రం అప్పలస్వామి, గుర్రం బాబురావు, బదిరెడ్డి చిన్నారావు పర్యవేక్షించారు.

పాడి రైతుకు బీమా పరిహారం



బీమా పరిహారాన్ని ఇస్తున్న డెయిరీ మేనేజర్ శేషు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పాడిరైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ డెయిరీ పనిచేస్తోందని డెయిరీ మేనేర్ కె.శేషు అన్నారు. ఎస్ఇజెడ్ నాయనమ్మపాలెం గ్రామంలో ఆదివారం పాలరైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ ద్వారా రైతులకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు అనంతరం రాజన్న అప్పలనాయుడు అనే పాడి రైతు ఆవు మృతి చెందడంతో బీమా పరిహారం కింద మంజూరైన రూ.60వేలను అందించారు. హెరిటేజ్ డెయిరీలో సభ్యత్వమున్న పాడిరైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. రెండు లక్షలు, సహజ మరణానికి రూ.50వేలు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీను, పైడికొండ, అప్పారావు,.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గుర్రపు పందెం పోటీలు



పరుగు పందెం పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని కల్యాణ పోతురాజు పండుగ సందర్భంగా ఆదివారం గుర్రపు పరుగు పందెం పోటీలు నిర్వహించారు ఉత్సాహంగా సాగిన పోటీల్లో రామన్నపాలెం గురం విజేతగా నిలవగా, రెండవ బహుమతి పెద్దాపురం, మూడు, నాలుగు బహుమతులు భీమిలి, ఐదో బహుమతి సామర్లకోట గుర్రాలు గెలుపొందాయి.విజేతలకు స్థానిక ఎస్ఐ ఆదినారాయణరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరికి సత్యనారాయణ, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ, ఇతర నేతలు

తుమ్మపాల వివి.రమణ సుగర్ ఫ్యాక్టరీని

దివాలా సంస్థగా ప్రకటించడం దారుణం

అఖిలపక్ష పార్టీల సమావేశంలో సిపిఐ నేత భద్రం



మాట్లాడుతున్న సిపిఐ నేత భద్రం

ప్రజాశక్తి- అనకాపల్లి : వేలాదిమంది రైతుల భాగస్వామ్యంతో సహకార రంగంలో కొనసాగుతున్న తుమ్మపాల వివి రమణ సహకార చక్కెర కర్మాగారాన్ని రైతులతో సంప్రదించకుండా ఎలా దివాలా సంస్థగా అధికారులు ప్రకటిస్తారని అఖిలపక్ష ప్రజాసంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథబాబు, ప్రజా రాజకీయ వేదిక నాయకులు కనిశెట్టి సురేష్‌బాబు, ముక్కామల చిన్న తదితరులు మాట్లాడారు.

రైతులు తమ భార్యల పుస్తేల తాళ్లు అమ్మి, సహకార రంగంలో నిలబెట్టుకున్న వివి రమణ షుగర్ ఫ్యాక్టరీని జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా, రైతులకు తెలియపరచకుండా దివాలా సంస్థగా ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఈ ఫ్యాక్టరీపై ఆధారపడిన రైతులు, కార్మికులతో పాటు పరోక్షంగా జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఫ్యాక్టరీకి సంబంధించిన భూములను కబ్జా చేసేందుకు రాజకీయ పెద్దలు తుమ్మపాల సుగర్స్‌ను దివాలా తీయించేలా చేస్తున్నారని విమర్శించారు. రైతులు కార్మికులు ప్రజా సంఘాలు, అఖిలపక్ష రాజకీయ నాయకులతో కలసి ఫ్యాక్టరీని పరిరక్షించుకుంటామన్నారు. ఇప్పటికైనా తుమ్మపాల సుగర్స్ ఫ్యాక్టరీని అమ్మాలని ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని, పదేపదే ఇస్తున్న వాగ్ధానాల మేరకు ఆధునికీకరించి, పున:ప్రారంభించాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన తప్పదని హెచ్చరించారు.

తారకరత్నకు అభిమానుల ఘననివాళి



తారకరత్నకు నివాళులు అర్పిస్తున్న నేతలు, అభిమానులు

ప్రజాశక్తి- అనకాపల్లి : చలనచిత్ర నటుడు, తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు మనుమడు తారకరత్న మరణవార్త అభిమానులు, పార్టీ శ్రేణులను తీవ్రంగా కలచివేసిందని అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణ బాలకష్ణ, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పరమేశ్వరి పార్క్ జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా బుద్ధ మాట్లాడుతూ భవిష్యత్తులో టిడిపి క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటానని ప్రకటించిన తారకరత్న అకాలమరణం బాధాకరమన్నారు. పట్టణ బాలకష్ణ ఫ్యాన్స్ ప్రతినిధులు దూలం ప్రసాద్, పెతకంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆసుపత్రిలో 23 రోజులపాటు మృత్యువుతో పోరాడిన తారకరత్న, చివరకు అభిమానులకు దూరం కావడం దురదృష్టకరమన్నారు. తారకరత్న ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో చదరం శివఅప్పారావు, పీలా శ్యాం, కోరిబిల్లి మహాలక్ష్మినాయుడు, కొణతాల బుల్లిబాబు, బుద్ధ కాశి, సూరిశెట్టి శివ నూక అప్పారావు, బుద్ధ విశ్వనాథం, కొణతాల రామప్పారావు, కాండ్రేగుల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు

నునపర్తి క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ -19 అంతర జిల్లాల బాల్‌బాడ్మింటన్ బాలురు, బాలికల పోటీలకు విశాఖ జిల్లా తరపున నునపర్తి శ్రీ రామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్‌కు చెందిన పది మంది క్రీడాకారులు ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ మండల అసోసియేషన్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు తెలిపారు.. రావికమతం మండలం టి.ఆర్జాపురం హైస్కూల్‌లో జరిగిన క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నునపర్తి శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్‌కు చెందిన బి.ప్రసాద్, కె.హేమకుమార్, ఎం.లయవర్ధన్, ఎం.రాథాస్రవంతి, ఆర్. కల్యాణి, జె.హైమావతి ,డి. రాజ్యలక్ష్మి, వై. హేమబిందు, పి.ప్రశాంతి, పి.సుష్మశ్రీ ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన నునపర్తి శ్రీరామ క్లబ్ క్రీడాకారులను మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పెదపూడి శంకరరావు, ప్రధాన కార్యదర్శి మాసవరపు అప్పారావు ,కోచ్ డి.శ్రీనివాస్, గ్రామస్తులు క్రీడాకారులను అభినందించారు.

689వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, ప్రభుత్వ రంగంలోనే అది నడుస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు ఆదివారానికి 689వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ద్వారా వివిధ రకాల పన్నుల రూపంలో వేలాది కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం కేవలం ఐదు వేల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు ఏటా వందల వేల కోట్లు ఆదాయం సమకూరుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దారుణ మన్నారు. ఉక్కు కర్మాగారానికి అవసరమైన సొంత గనులను కేటాయించాలన్నారు. బ్యాంకుల నుంచి రుణ సాయం అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, కె.ఈశ్వర రావు, ఎన్ఎడి సివిలియన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.మారయ్య, అధ్యక్షుడు ఆర్.మహంతి, ఎయు మాజీ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మిక సంఘం నేతలు, కార్మికులు

స్వాతిముత్యం సినిమా ఎప్పటికీ ఆణిముత్యమే



నివాళులర్పిస్తున్న ఎంవీ రఘు, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వాతి ముత్యం సినిమా ఎప్పటికీ ఆణిముత్యమేనని సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు అన్నారు. స్వాతిముత్యం సినిమా విడుదలై 37 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పని చేసిన ఆయన ఆదివారం ఉదయం ఎయు హిందీ భవన్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత బెంగళూరులో తుది శ్వాస విడిచిన తారకరత్నకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభకు స్వాతిముత్యం ఓ తార్కాణమన్నారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి.పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు పాల్గొన్నారు.

పోతురాజుబాబుకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి శివారు పంగిడి పోతురాజు బాబు లోవలో ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గునూరు మల్లునాయుడు ఇతర టిడిపి నేతలు పోతురాజుబాబుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధనను ప్రారంభించి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, మాజీ ఎంపిటిసిలు రుత్తల రాము, గొన్నాబత్తుల శ్రీనివాసరావు మరిసా సతీష్, మరిసా నరేష్ పాల్గొన్నారు.

గోదావరి డెల్టా రబీ పంటకు డొంకరాయి జలాశయ నీరు

వచ్చేనెల 8 వరకు మూడు వేల క్యూసెక్కులు విడుదల


ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు: గోదావరి డెల్టా రబీ పంటకు సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని ఆదివారం ఉదయం విడుదల చేసినట్లు ఏపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) కెకెవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధి జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం నాలుగువేల క్యూసెక్కుల నీటిని గోదారి డెల్టాకు విడుదలవు తోందన్నారు. గోదావరి డెల్టా రబీ పంటకు నెలరోజుల పాటు మూడు క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు కోరినప్పటికీ, తమకున్న నీటి అవసరాల మేరకు అలా విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకే వచ్చేనెల 8 వరకు గోదావరి డెల్టాకు నీటిని విడుదల చేస్తామని వెల్లడించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో 32 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయని, వీటిని జూన్ నెలాఖరు వరకు విద్యుదుత్పత్తికి, తాగునీటి అవసరాలకు వినియోగించనున్నట్లు ఎస్ఇ ప్రశాంత్ కుమార్ వివరించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో సీలేరు, డొంక రాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుదుత్పత్తిని కొనసాగిస్తామన్నారు

వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి అంపైర్‌గా శర్మ


డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, స్థానిక ఎల్ఐసిలో హెచ్‌జిఏగా పనిచేస్తున్న డివిఎస్‌వై.శర్మను గోవాలో జరగబోయే మొట్టమొదటి ఇంటర్నేషనల్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఎంపైర్‌గా ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నియమించింది. ఈ టోర్నమెంట్ గోవాలోని డాక్టర్ శ్యాం ప్రసాద్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 26 నుంచి మార్చి 6 వరకూ జరుగనుంది. శర్మ గత సెప్టెంబర్‌లో లావోస్‌లో జరిగిన ఏషియన్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ టేబుల్ టెన్నిస్‌లో అత్యుత్తమ ఎంపైర్‌గా బెస్ట్ బ్లూ బ్యాడ్జ్ స్టేటస్ అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్ బాబు, పర్సనల్ మేనేజర్ భగవాన్ ప్రసాద్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వరప్రసాద్, కామేశ్వరి, పలువురు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు శర్మను అభినందించారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి- కె.కోటపాడు :మండలంలో ఆర్లి గ్రామంలోని స్వయంభూ శివాలయాన్ని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు ఆదివారం సందర్శించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగాబ స్వయంభూ శివుని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా కింతాడ మాజీ సర్పంచ్ బత్తి వెంకటరమణ అభ్యర్థన మేరకు ఆలయ అభివృద్ధికి తన వంతు పూర్తి సమకారం అందిస్తానని ప్రసాదరావు భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా పైలా ప్రసాదరావుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సింగందొర పాలెం సర్పంచ్ వెలగల పైడంనాయుడు, బండారు దొరబాబు, పిల్లల రమణ, గన్‌రెడ్డి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి: సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని జాతీయ బాలలసైన్స్ కాంగ్రెస్ కాకినాడ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ పక్షోత్సవాలలో భాగంగా ఆదివారం విబివిఆర్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని దేవరాపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో సైన్స్ క్విజ్, వ్యాసరచన, సైన్స్ ప్రాజెక్టుల నమూనా ప్రదర్శన పోటీలను నాడు నిర్వహించారు. ఈ పోటీలలో 142 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని, నిజజీవితంలో సంఘటనలను సైన్స్‌తో అన్వయించి, ఆలోచించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ఎం డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పరిశోధనలతోనే దేశపురోభివృద్ధి ముడిపడి ఉందన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణదొర మాట్లడుతూ సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు ఎస్ కోటేశ్వరరావు, ఎమ్ వీరారెడ్డి, వై.సతీష్, సి.హెచ్ శ్రీనివాస కిరణ్, బాలకుమార్ పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీనివాసరావు

అన్నదాతల దుస్థితికి అద్దం పట్టిన 'రైతంటే'

ఆకట్టుకుని, ఆలోచింపజేసిన నాటిక ప్రదర్శనలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలోని గ్రామీణ కళామందిరంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం రాత్రి ప్రదర్శించిన రైతంటే, అంతర్మథనం నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ఆలోచింపజేశాయి. మన్నును అన్నంగా మార్చి అందరి ఆకలి తీర్చే రైతన్నను, కొంతమంది దళారులు రంగ ప్రవేశం చేసి, తమ స్వార్థం కోసం రైతు కుటుంబంలో గొడవలు సృష్టించి, తండ్రి కొడుకుల మధ్య వైరాన్ని పెంచి, ద్వేషాన్ని రగిలించడం, తమ ధన దాహం కోసం పచ్చని పంటపొలాల్లో కాలుష్యాన్ని వెదజల్లే ఫ్యాక్టరీలను నెలకొల్పేందుకు రైతు వద్ద నుండి బలవంతంగా భూములు లాక్కునే తీరు, పది మందికి అన్నం పెట్టే అన్నదాత కుటుంబంలో రియల్ బూమ్ పెట్టిన చిచ్చుతో చివరకు రైతన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి ప్రేరేపించడం ఇతివృత్తంతో మునగపాక శ్రీలక్ష్మి కళాయూనియన్ కళాకారులు ప్రదర్శించిన 'రైతంటే' నాటిక హృద్యమంగా సాగింది. నేడు రైతన్నలు పడుతున్న వెతలను కళ్ల ముందు సాక్షాత్కరింపజేస్తూ, కళాకారులు తమ పాత్రకు జీవం పోసేలా నటించి, అందరి కంట తడిపెట్టించారు. అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను రంజింపజేసి వారి మన్ననలు, ప్రశంసలు పొందారు.

ఆలోచింపజేసిన 'అంతర్మథనం'

వయసు మళ్లినా సిగ్గు లేకుండా, భార్యకు తెలియకుండా చాటుమాటు శంగారం జరుపుతూ, పోలీసులకు అడ్డంగా దొరికిపోయి, తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి మరిన్ని తప్పులు చేసి భార్యాబిడ్డల ముందు అలుసైపోయిన ఓ తండ్రి కథ 'అంతర్మథనం'. మునగపాకకు చెందిన 'వెలగా వీరునాయుడు మాస్టారు మెమోరియల్ ఆర్ట్స్' కళాకారులు నేటి సమాజంలోని కొందరి మగాళ్ల వికృత పోకడలకు అద్దం పడుతూ, మంచి సందేశాన్నిచ్చేలా నటించి ఆహూతులను ఆకట్టుకున్నారు. తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము ఆధ్వర్యంలో ప్రదర్శితమైన ఈ నాటికలుఈ కళాభిమానులకు కనువిందు చేశాయి.


రైతంటే నాటికలో కన్నీళ్లు తెప్పించే సన్నివేశం

అననుకూల ప్రదేశాల్లో.. జగనన్న లే అవుట్లు

- కానరాని మౌలిక సదుపాయాలు
- ఇళ్ల నిర్మాణాలకు మొగ్గు చూపని లబ్ధిదారులు

ప్రజాశక్తి-రోలుగుంట: జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం కల్పించిన లే అవుట్లు అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు రాలేదు. మండలానికి జగనన్న లేఅవుట్ కింద 13 గ్రామాల్లో 500 మందికి స్థలాలు పంపిణీ చేశారు. వీరిలో 59 మందికి శరభవరం మెట్టపై స్థలం కేటాయించారు. అక్కడ అనుకూలంగా లేక పోవడంతో వారు నిర్మాణం చేపట్టలేదు. కంచుగుమ్మల గ్రామానికి చెందిన వారికి కొంతలం వెళ్లే రోడ్డులో కంచుగుమ్మల నందిపురం గ్రామానికి మధ్యలో కొండను ఆనుకొని ఉన్న బంజరు భూమిలో 29 మందికి స్థలం కేటాయించారు. అనుకూలంగా లేదని వారు నిర్మాణం చేపట్టలేదు. కె.అడ్డసరం గ్రామంలో 27 మందికి పాతూరు దిబ్బ వద్ద స్థలాలు ఇవ్వగా వీరు కూడా నిర్మాణం తలపెట్టలేదు. రోలుగుంట గ్రామంలో గౌరమ్మ కోనేరు దిగువ భాగాన 12 మందికి కేటాయించారు. అక్కడ కూడా అనుకూలంగా లేదని నిర్మాణం చేపట్టలేదు. వి.శరభవరం పంచాయతీ శివారు లోసింగి గ్రామానికి చెందిన షెడ్యూల్ తెగలకు చెందిన వారికి 40 మందికి కేటాయించారు. వారు కూడా ఒక్కరు నిర్మాణం చేపట్టలేదు. అనుకూలంగా లేని ప్రాంతాల్లో స్థలం కల్పించడం, రహదారి లేక ఇళ్ల మెటీరియల్ కొండ మీదకు తీసుకువెళ్లే అవకాశం లేక జగనన్న కాలనీ ఇళ్లు ప్రారంభం కాలేదు. సుమారు 500 మందికి స్థలం కల్పిస్తే 200 మంది నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికైనా సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



కంచుగుమ్మలలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలం

సౌకర్యాలు కల్పించాలి

చాలా గ్రామాల్లో జగనన్న లే అవుట్లలో సౌకర్యాలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. హౌసింగ్ అధికారులు మాత్రం ఇనుము, ఇసుక అందరికి పంపిణీ చేశామని రికార్డుల్లో మాత్రం చూపి స్తున్నారు. లబ్ధిదా రులకు మౌలిక సదుపాయాలు కల్పించి పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరిగేలా జిల్లా అధికారులు స్పందించాలి



ఈరెల్లి చిరంజీవి
సిపిఎం నాయకులు



డిఎస్పీని సన్మానిస్తున్న సర్పంచ్

డిఎస్పి ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పాకలపాడు పంచాయతీ శివారు వెంకట్రాపురంలోని పాకలపాడు దామరాజు వెంకటరామరాజు పంతులు బాబు ఆశ్రమానికి నర్సీపట్నం డిఎస్పీ ప్రవీణ్‌కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ ఆశ్రమం తరపున సిఐకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రమణయ్య పాల్గొన్నారు.



నాచు, గడ్డిని తొలగిస్తున్న కూలీలు

పుష్కరిణి పరిశుభ్రతకు చర్యలు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక పుష్కరిణి లో నాచు, గడ్డి ఇతర వ్యర్థ పదార్థాల తొలగింపునకు టిటిడి అధికారులు చర్యలు చేపట్టారు. ఉపమాక పుష్కరిణి నాచు, గడ్డి, ఇతర వ్యర్థ పదార్థాలతో అధ్వానంగా ఉండటంపై ఈనెల 6న ప్రజాశక్తి దినపత్రికలో 'అస్తవ్యస్తంగా ఉపమాక పుష్కరిణి' శీర్షికను కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే బాబురావు ఈ కథనాన్ని చదివి మరోసారి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆదివారం కూలీలు చెరువులో నాచు, గడ్డి, ఇతర వ్యర్థ పదార్థాలు, చెత్త తొలగింపు పనులను ప్రారంభించారు.



మాట్లాడుతున్న గ్రామస్థులు

ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జి.కొత్తూరు గ్రామంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికంగా ఉన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకుగాను గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిటిసి కె.సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ పాణి శాంతారామ్, వైస్ ప్రెసిడెంట్ కె.లోకేష్‌లు ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడంతో పరిష్కరించాలని ఆయన విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. స్పందించిన విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సురేష్‌బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యానందం, గొలుగొండ ఎఇ రాజేంద్ర ప్రసాద్‌లు వెంటనే గ్రామంలో విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని రామయ్య పట్నం గ్రామానికి చెందిన పంపరబోయిన లోవరాజు (38) మేడ మెట్లపై నుండి జారి పడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. గత నెల 19న అడ్డురోడ్డు పెట్రోల్ బంక్ లో డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన లోవరాజు మేడపై పడుకున్నాడు. రాత్రి 11 గంటలకు సమయంలో మూత్ర విసర్జనకు మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కేజీహెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ గత రాత్రి మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. భార్య పంపరబోయిన ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్సై ప్రసాదరావు తెలిపారు.

ఆశ్రమాన్ని ముత్యాల సతీష్ సందర్శన

ప్రజాశక్తి-రోలుగుంట: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని కుసర్లపూడి గ్రామంలో పాకలపాడు గురుదేవుల ఆశ్రమం ఆశ్రమాన్ని ఎంవిఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ సందర్శించారు. ముందుగా సుబ్బారాయుడుపాలెం గ్రామం నుండి సుమారు 100 బైకుల ర్యాలీతో బయలుదేరి పాకలపాడు ఆశ్రమానికి చేరుకున్నారు. ఆలయ నిర్వహకులు, మహిళలు ఘన సతీష్‌ఖు స్వాగతం పలికారు. శ్రీపాకలపాడు గురుదేవుని వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆ మహాశివుని దర్శించుకున్నారు. ముత్యాల సతీష్ చేతుల మీదుగా నిరుపేదలకు దుప్పట్లు, రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ ఆశ్రమానికి ముత్యాల సతీష్ ఆలయ నిర్వహణకు ధన సాయం చేశారు. ఆలయ నిర్వాహకులు సతీష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గండి సింహాద్రి, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సతీష్

ఆలయంలో అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చందనాడ గ్రామంలో ఆదివారం దుర్గాదేవి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.



అన్నసమారాధనకు హాజరైన భక్తులు



ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని గోకులపాడు గ్రామంలో ఆదివారం రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్ (ఎంటి) రామగోవింద్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడితో లాభాలను పొందవచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఎల్.నాగ గోవిందు, ఎల్.రాము (ఐసిఆర్‌పి) వి.కనకరావు, ఏ.కాసులు, డి.నందిని, ఎస్.లావణ్య, ఏ.అనురాధ, రైతులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వ దోపిడీ తీవ్రం

-నిధులు లేక కుంటుపడుతున్న పంచాయతీలు - మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఇసుక, మైనింగ్, లిక్కర్ వంటి వాటిలో దోపిడీ చేస్తుందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మీడియాకు పంపించిన వీడియోలో విమర్శించారు. వీటి దోపిడీలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, దీనిలో భాగంగానే ఇటీవల ముఖ్యమంత్రి భార్య వైయస్ భారతి లిక్కర్ స్కాంలో పేరు వినిపిస్తుందన్నారు. ఆస్తులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి దోపిడీలు చేస్తుంటే ఎవరు అడ్డుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఉపాధి హామీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. దోపిడీ చేసిన ఉపాధి హామీ డబ్బులు చెల్లించకపోతే రాష్ట్రంలో ఉద్యమాలు జరుగుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని చూస్తూ ఎందుకు ఊరుకుంటుందని తప్పుని ప్రోత్సహించుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల డబ్బులు ప్రజలకు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 12 వేలకు పైగా ఉన్న పంచాయతీలకు విడుదలైన 14, 15 ఫైనాన్స్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి లాగేసుకుందని, ఇలా అయితే రాష్ట్రంలో పారిశుధ్యం ఎలా మెరుగు పడుతుందన్నారు. పంచాయతీలో ఎటువంటి సదుపాయాలు ఏర్పాటు చేయలేకపోతున్నారని దీంతో, సర్పంచులకు విలువ లేకుండా ప్రభుత్వం చేసిందని, తెలిపారు. సర్పంచులు ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు.



భక్తులతో దారమఠం కిటకిట


ప్రజాశక్తి-గొలుగొండ:మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని దారమఠంలో ఉమాదారామల్లేశ్వరస్వామి ఆలయం రెండో రోజు ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. ఎస్సై నారాయణరావు ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.



సాగు చేస్తున్న జనుము

విస్తారంగా జనుము సాగు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా విస్తారంగా జనుము సాగు చేస్తున్నారు. లింగా పురం, వెంకటాపురం, పాములవాక, ఎండపల్లి, రాజుపేట సహా పలు గ్రామాల్లో రైతులు వరి సాగు అనంతరం జనుము పంటపై ఆసక్తి చూపుతున్నారు. జనుము సాగుతో భూసారం వృద్ధి చెందడంతో పాటు చేనుకు చీడపీడల నిమిత్తం ఎటువంటి ఖర్చు లేక పోవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు తెలిపారు. అంతేకాకుండా జనుమును పశుగ్రాసంగా వినియోగించుకోవచ్చునని, ఆరుతడి పంట కావడంతో పెట్టుబడి ఖర్చులు తక్కువగా ఉంటాయని రైతులు తెలిపారు. ఇటీవల కాలంలో పొలాలలో కోతులు బెడద ఎక్కువగా ఉండటంతో జనుము పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జనుమును ఖరీఫ్ సీజన్ లోనూ అధికంగా సాగు చేసి పచ్చిరొట్ట ఎరువుగా రైతులు అధికంగా వినియోగిస్తారని, దీంతో డిమాండ్ అధికంగా ఉంటుంది.



స్టిక్కర్లు అందజేస్తున్న బాబూరావు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పిలుపునిచ్చారు. నక్కపల్లిలో వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి కొబ్బరి తోటలో ఆదివారం మండలానికి సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మునుపెన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా ప్రజలు ముంగిటకు చేరవేయడం జరుగుతుందన్నారు.పాయకరావుపేట నియోజకవర్గంలో తాను అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. డిగ్రీ కళాశాల, 50 పడకల ఆసుపత్రి, రోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నా, లేకపోయినా పాయకరావుపేట ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కన్వీనర్లకు, గృహసారథులకు స్టిక్కర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, బొల్లం బాబ్జి, చంద్రరావు, సూరకాసులు గోవింద్, గొర్ల నరసింహమూర్తి, ఎలమంచిలి తాతబాబు, శేషారత్నం, బాబూరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించండి

-పలు చోట్ల విస్తృత ప్రచారం



అనకాపల్లిలో ప్రచారం చేస్తున్న లోకనాథం, గంగారావు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉత్తరాంధ్ర సమస్యలపై సంపూర్ణ అవగాహన, ప్రజాసమస్యలపై పోరాడాలన్న సామాజిక స్పృహ, చొరవ, చిత్తశుద్ధి ఉన్న ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభను బలపరిచి, మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జివిఎంసి 78వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ బొడ్డు గంగారావు పిలుపునిచ్చారు. రమాప్రభను గెలిపించాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని గాంధీనగరం, అంజయ్య కాలనీ, విజయరామరాజుపేట, శ్రీరామ్‌నగర్ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ ఇవ్వకుండా రాష్ట్రానికి కేంద్రం మోసగించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దీనిపై రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రశ్నించకపోగా, వంత పాడుతోందని, రూ.మూడు లక్షల కోట్ల విలువచేసే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రూ.30 వేల కోట్లకు అమ్మేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నా పోరాడే దమ్ములేని పార్టీల అభ్యర్థులను గెలిపించే కన్నా, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక హక్కుల కోసం, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాడుతున్న రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బి ఉమామహేశ్వరరావు, జంప రమేష్, శాస్త్రి, రంగబాబు, రమేష్, రాజేష్, దేవుడు నాయుడు, గంట శ్రీరామ్, ఎస్ రమణ, తరుణ్ పాల్గొన్నారు.



కోటవురట్లలో కరపత్రాల పంపిణీ

సిఐటియు, రైతుసంఘాల నేతల ప్రచారం

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె. సోమునాయుడు తదితరులు కోరారు. ఆదివారం తిమ్మరాజుపేటలో పట్టభద్రుల ఓటర్లను కలిసి, పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను బలపరచాలని అభ్యర్థించారు. తిమ్మరాజుపేట పిఎసిఎస్ సిఇఓ మహేశ్వరరావు కలిసి రమాప్రభకు ఓటేయాలని కోరారు.



తగరపువలసలో

ఎల్ఐసి ఉద్యోగుల ప్రచారం

కోటవురట్ల::ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ఆదివారం నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామంలో నర్సీపట్నం ఎల్ఐసి యూనియన్ ప్రెసిడెంట్ వి చిననూకరాజు (చంటి) ప్రచారం నిర్వహించారు. సిపిఎస్ రద్దు, ఓపి ఎస్ పునరుద్ధరణ సహా కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు, తదితర సంఘాల సమస్యల పట్ల గళం విప్పే ఏకైక అభ్యర్థులు పిడిఎఫ్ ఎమ్మెల్సీ లేనని తెలిపారు. రమాప్రభను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు,పాల్గొన్నారు.

గాజువాక : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ గెలుపును కోరుతూ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం మింది గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో లోకేష్, డి.అప్పారావు, ఏటి గోపాలరావు, వర్రీ వెంకటరావు, వనమాడ అప్పలరాజు, రాంబాబు పాల్గొన్నారు.



తిమ్మరాజుపేటలో ప్రచారం

మిందిలో ప్రజా సంఘం నాయకుల ప్రచారం

ములగాడ : 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, శ్రీనివాసనగర్, రాంనగర్, కుంచమ్మ కాలనీ, 59వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ బోర్డు కాలనీ, గణపతి నగర్, హిమాచల్‌నగర్, శాంతిగిరి కాలనీ, 60వ వార్డు ఎంఐజి కాలనీ, 61వ వార్డు పరిధి మల్కాపురం పల్లెవీధి, గొల్లవీధి గాంధీజీ వీధి, హరిజన వీధి, శెట్టిబలిజ వీధిలో పట్టభద్రుల ఓట్లర్లను ప్రజాసంఘాల నాయకులు కలిశారు. విద్యావంతులు, సామాజిక కార్యకర్త డాక్టర్ రమాప్రభకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రలోభాలకు, డబ్బులకు లొంగకుండా నీతివంతులను గెలిపించుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ ప్రచారంలో ఐద్వా మల్కాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మమత ఆర్.విమల, సభ్యులు ఉమ, విజయ, కృష్ణవేణి, నిర్మల, తిరుమల, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్, మోహన్, సుభానీ, సురేష్, రాజు, శ్రీను, రాంబాబు, ఈశ్వరరావు, వెంకట్, కుమార్, ప్రశాంత్, సిఐటియు నాయకులు కె.పెంటారావు, వై.గంగాధర్, పి.వి.భాస్కర్, పెన్షనర్ల సంఘం నాయకులు కె.నూకరాజు, ఆర్.దేవరాజు, తాతాజీ, నర్సింగరావు, హుస్సేన్, జానీ తదితర్లు పాల్గొన్నారు.

భీమునిపట్నం : సిఐటియు భీమిలి జోన్ నాయకులు రవ్వ నరసింగరావు ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను అందించారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు.

శిథిలావస్థలో రెవెన్యూ కార్యాలయం

-ఊడిపడుతున్న శ్లాబ్ పై పెచ్చులు- వర్షపు నీరు చేరడంతో తడిసిపోతున్న రికార్డులు

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి ప్రమాదభరితంగా మారింది. దీంతో విధి నిర్వహణ చేస్తున్న ఉద్యోగులంతా పైనుంచి ఏ క్షణంలో పెచ్చులుడుతాయనన్న భయాందోళనతోనే విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంకు వచ్చే ప్రజలు వేచి ఉండే వరండా శ్లాబ్ కూడా పెచ్చులూడి పోయి ప్రమాదబరితంగానే ఉంది. గతంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సమయంలో సీలింగ్‌కు ఉన్న పెచ్చులు ఊడి పోవడంతో తిరుగుతున్న ఫ్యాన్ కింద పడి పోయింది. అదృష్టవశాత్తు ఎవరికి ప్రమాదం సంభవించలేదు. 1990 సంవత్సరంలో నిర్మించిన ఈ భవనానికి అధికారులు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు. పలుమార్లు భవనం పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించిన నేటి వరకు ఎటువంటి మరమ్మత్తులను చేపట్టడానికి అధికారులు నిధులు మంజూరు చేయలేదు. పెచ్చులు ఊడి పోవడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో నీరు లీకై రికార్డులు పాడైన సందర్భాలు ఉన్నాయి. రెండు మూడు పర్యాయాలు వర్షపు నీరు చేరడంతో షార్ట్ సర్క్యూట్లు జరిగి వైరింగ్ కాలి పోయిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కొత్త భవనాన్ని మంజూరు చేసి నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.



దెబ్బతిన్న శ్లాబ్

సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలోని జి మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శుక్ర, శని, ఆదివారం వరుసగా మూడు రోజులుగా షూటింగ్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. సినీనటుడు బ్రహ్మాజీ తనయుడు, సంజీవరావు కథానాయకుడుగా, అయాసా కథనాయకగా నటించే గుట్టుచప్పుడు చిత్రానికి పాట చిత్రీకరించినట్లు సినిమా యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ చిత్రానికి డైరెక్టర్‌గా మణీంద్రన్, ప్రొడ్యూసర్ లివింగ్‌స్టన్, డాన్స్ మాష్టర్‌గా ప్రశాంత్ పని చేస్తున్నారు. జలపాతంలో హీరో, హీరోయిన్‌ల మధ్య పాటను చిత్రీకరించారు.

దిగసల్తాంగిలో విషాద ఛాయలు

ప్రజాశక్తి - హుకుంపేట : అనంతగిరి మండలం లంగుపర్తి పంచాయతీ పులుసుమామిడి సమీపంలో రాయిపాడు జంక్షన్ వద్ద లోయలోకి బైక్ దూసుకెళ్లి ముగ్గురు మృతి చెందారు. హుకుంపేట మండలం ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బూర్జ పంచాయతీ దిగ సల్తాంగి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదనలు గ్రామంలో మిన్నంటాయి. తోడుగా నీడగా నిలిచిన యువకులు మృతిపై గ్రామస్తులు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతి చెందిన వారిలో రాప్ప బుట్టన్న (38), సిందేరి.రాంబాబు(20), బందం గణేష్(19) మృతదేహాల వద్ద కుటుంబీకుల రోదనలు పలువురుని కలచి వేసింది. కలకాలం తోడు ఉండాల్సిన పిల్లలు ప్రమాదవశాత్తుతో మరణించడంతో తల్లిదండ్రులకు గుండె కోత మిగిలింది.

మృతుల కుటుంబాలను అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, వాలాసి సర్పంచ్ సెంబీ సన్యాసిరావు, మాజీ సర్పంచ్ బాకా గురుమూర్తి, పాంగి బొంజుబాబు, నాయకులు, తదితరులు పరామర్శించారు.